క్లుప్తంగా

కాసాని విజయానికి కలిసిరావాలి



దెబ్బడగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కందుకూరు: బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని విజయానికి అందరూ కలిసిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని దెబ్బడగూడలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, నాయకులు జంగయ్య, దేవేందర్, సామయ్య, కార్తీక్, కొండల్‌రెడ్డి, జైపాల్, గణేష్, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్, సురేష్ పాల్గొన్నారు.

చామలను గెలిపిద్దాం

కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చిత్తాపూర్, లింగంపల్లి, ఆగపల్లిలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాంరెడ్డి, ఆరుట్ల ఎంపీటీసీలు శ్రీవాస్, రాందాస్ నాయక్, కోఆప్షన్ సభ్యులు వాజిద్, మల్లేశ్, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు.. మోతీరాంనాయక్, శ్రీనివాస్‌గౌడ్, దాసుగౌడ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎల్బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని.. మెట్రోను అటు ఎయిర్ పోర్టుకు, ఇటు హయత్ నగర్ వరకు విస్తరిస్తుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి తో కలిసి హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం, అగ్రికల్చర్ కాలనీలలో మధుయాష్కి గౌడ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికలలో ఎంపీగా గెలిపించినట్లుగానే సునీత మహేందర్ రెడ్డి కూడా గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలను తాము కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్, కార్పొరేటర్లు సుజాతానాయక్ పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై ఐదుశాతం రాయితీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఈనెల 30వ తేదీ లోపు ఆస్తిపన్ను చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి గాను ఆస్తిపన్నును రేపటిలోపు చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో లేదంటే సంబంధిత బిల్ కలెక్టర్ దగ్గర పన్ను చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులను కాపాడుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో నిర్వహించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అనంతరం పలువురు కార్మిక సంఘాల నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు యాదయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు భాస్కర్, రామకృష్ణ, రాజు, చెక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జంప్ జిలానీలు..!

- పార్టీలు మారుస్తూ రాజకీయ ఎత్తుగడలు
- ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని వైనం
- ఇది కొందరు నాయకుల పరిస్థితి



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు జంప్ జిలానీలు కొడుతున్నారు. పార్టీలు మారి రోజులు గడవకముందే తమ సొంత లాభాలు, ప్రయోజనాల కోసం రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. తమకు నష్టం జరుగుతుందని అనుకుంటే చాలు అధికారంలో ఉన్నా పార్టీలోకి, లేదా ఏ పార్టీకి బలం ఉంటే అందులోకి చేరుతున్నారు. అయితే కొందరు నాయకులు పార్టీల కండువాలు కప్పుకున్నా.. అక్కడ ఏమి కలిసిరాకపోవడంతో తిరిగి సొంత గూటికి చేరుతున్నారు.

ఉన్నా.. లేనట్లే..?

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ బీఆర్ఎస్‌లో ప్రాతినిధ్యం వహించేవారు. అయితే సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ఆయన పాలన సరిగ్గా లేదని, ఒంటెద్దు పోకడలకు వెళ్తున్నాడని కలెక్టర్‌కు తమ అవిశ్వాస తీర్మానాన్ని అందించి ఆయనను మేయర్ పీఠం నుంచి గద్దె దించారు. దీంతో మహేందర్‌గౌడ్ తన అనుకూల ముగ్గురు కార్పొరేటర్లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే అందులో చేరి రోజులు కాకముందే మళ్లీ తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. ఆయన ఏ పార్టీలో ఉన్న నష్టమేనని ఎలాంటి ప్రయోజనం ఉండదని పలువు రు ఆరోపిస్తున్నారు. మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ బీఆర్ఎస్‌లో ఉన్నా లేనట్లేనని సొంత పార్టీల నాయకులే గుసగుసలాడుతున్నారు.

కేటీఆర్ సమక్షంలో చేరిక..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలతాసురేశ్‌గౌడ్, సాగర్‌గౌడ్, పద్మావతిపాపయ్యయాదవ్, సురేశ్‌గౌడ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో సోమవారం కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సెక్టార్ అధికారి గుర్రం ఇంద్రాసేనారెడ్డి కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, కప్పపహాడ్, తులేకలాన్, ఎల్మినేడు తదితర గ్రామాల్లో ఓటరు ఐడెంటిఫికేషన్ స్లిప్పులను సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సెక్టార్ అధికారి గుర్రం ఇంద్రాసేనారెడ్డి పర్యవేక్షించారు. ఓటర్ల పేర్లు, క్రమ సంఖ్య, గుర్తింపు నంబర్లు సరిగా ఉన్నాయా లేదా సరి చూసుకోవాలని సూచించారు. స్లిప్పులు పంపిణీలో నిర్లక్ష్యంగా చేస్తే సహించేది లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులు రవీందర్, సాయికుమార్, బూత్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు వేయండి..

తుర్కయంజాల్: ఓటుహక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయాలని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి మునగనూర్‌లో ఆయన బీఎల్‌లతో కలిసి ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్‌ల పంపిణీని చేపట్టారు. ఇంటింటికి స్లిప్‌లను పంపిణీ చేస్తున్నామని.. చేరనివారు బీఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు.

ఆదిబట్ల మున్సిపాలిటీలో

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని 9వ వార్డులో ఆయన సిబ్బందితో కలిసి ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. జూన్ 13వ తేదీన జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. మేనేజర్ శ్రీనివాస్, బూత్ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను సోమవారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ స్టేషన్లల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఏసీపీ కేపీవీ రాజు
- ఖానాపూర్‌లో పోలీసుల కవాతు



ఖానాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పోలీసులు నిర్వహించిన కవాతులో ఏసీపీ కేపీవీ రాజు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జూన్ 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికలు శాంతియుత వాతవరణంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవలన్నారు. ఓటువేయాలంటూ అభ్యర్థులెవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారయణ, ఎస్ఐలు మారయ్య, మైబెల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలి



పారిజాత సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ దేవేందర్ నగర్ కాలనీ 1వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ పలువురు కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రావిర్యాల మాజీ సర్పంచ్ బోద జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. గతంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొంది అధికారం కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ప్రజాపాలన సాధ్యమవుతుందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనునిత్యం ప్రజల కోసం పని చేసే రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలను గుర్తు పట్టని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. మతతత్వ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ జెండాలను మెడలో వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండురంగారెడ్డి , చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, మల్లేష్, రమేష్, శేఖర్, రాజు, తిరుతయ్య, మైనుద్దీన్, కృష్ణ, యాదగిరి,మహాదేవులు,సంజీవ,మన్యం, విజయ్, మహేష్, వివేక్ పలువురు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్నస్వామి కల్యాణోత్సం

యాచారం: మండల పరిధిలోని నస్దిక్ సింగారంలో సోమవారం మల్లన్నస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో రెండు రోజులుగా శ్రీ గొల్ల కేతమ్మ, శ్రీభ్రమరాంభ, ఎల్లమ్మ దేవత, శ్రీచౌడమ్మ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుంది. విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం రాత్రి దేవతామూర్తులకు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. సోమవారం మల్లన్నస్వామి కల్యాణోత్సం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బీజేవైఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వన్నెవాడ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అరుణమ్మ, మాజీ ఉప సర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు.. లక్ష్మణ్, జంగయ్య యాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

టిప్పర్ల పట్టివేత

యాచారం: సాగర్ రోడ్డుపై అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం యాచారం పోలీసులు పట్టుకొని తహసీల్దార్ అయ్యప్పకు అప్పగించారు. ఈ క్రమంలో తహసీల్దార్ టిప్పర్ యజమానులకు రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని సీఐ శంకర్‌కుమార్ హెచ్చరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కల్వకుర్తిలో ముఖ్యనేతలతో సమావేశం

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవికి కల్వకుర్తి నుంచి భారీ మెజార్టీ తీసుకురావాలని ఆయన కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం.. నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల కోసం నియోజకవర్గ కమిటీ, అన్ని మండలాల ఎన్నికల కమిటీలను నియమించారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నేతృత్వంలో కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఆదిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, కల్వకుర్తి ఎన్నికల ఇన్‌చార్జి ఇందిరా శోభన్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్, సీనియర్‌నేతలు.. బిచ్చానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మోతీలాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆనంద్ కుమార్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు ఓటర్లను కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోకు సంబంధించి వాల్‌పోస్టర్లను కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్రం కేశవులు మాట్లాడుతూ.. గతంలో రెండుసార్లు ఎంపీగా పనిచేసిన మల్లురవి పిలిస్తే పలికే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారని.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, ఖాదర్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం... సమస్తం నిక్షిప్తం

- 360 డిగ్రీల కెమెరాలతో పర్యవేక్షణ



ఎల్బీనగర్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేదుకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. నగదు మద్యం ఇతర వస్తువులు పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే బృందాలను ఏర్పాటు చేసింది. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశపెట్టిన 360 డిగ్రీల కోణంలో కెమెరాల విధాన్ని పార్లమెంటు ఎన్నికల్లో వినియోగిస్తున్నారు.

రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం...

నిఘా బృందాల వాహనాలకు 360 డిగ్రీల కెమెరాలను బిగించారు. అధునికి సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని రూపొందించారు. ప్రతి నియోజకవర్గంలో తనిఖీ బృందాలను ఈ వాహనాలను ఏర్పాటు చేశారు. వీటికి జియోట్యాగింగ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర జిల్లా ఎన్నికల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఆయా నియోజకవర్గంలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు వీక్షిస్తారు.

బృందాల ఏర్పాటు

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 9 ప్రత్యేక నిఘా బృందాలు పని చేస్తున్నాయి.పోలీస్, గెజిటెడ్ అధికారితో పాటు ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ఈ నిఘా బృందాలు మూడు షిప్టుల్లో పనిచేస్తాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, మద్యం ఇతర పంపకాలు జరిగినా వెంటనే సమాచారం అందుకుని అక్కడకు వెళ్లి అడ్డుకట్టు వేసేందుకు చర్యలు తీసుకుంటారు. వీడియో సర్వైలెన్స్ బృందం ద్వారా వచ్చిన వీడియోలను ప్ల్యాయింగ్ బృందం సభ్యులు నిశితంగా పరిశీస్తారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ బృందంలో గెజిటెడ్ అధికారితో పాటు పోలీసు , వీడియోగ్రాఫర్ ఉంటారు. నియమావళి, ఉల్లంఘన, అభ్యర్థుల ప్రచారం ఖర్చులపై వీరు నిఘా పెడుతారు..

అంగన్‌వాడీలతో క్రమశిక్షణ

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల

తలకొండపల్లి: మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల.. తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీలో పంపిణీ చేసే బలవర్ధక ఆహారం పిల్లల ఎదుగుదలకు ఎంతగానో దోహద పడుతుదని పేర్కొన్నారు. మండల పరిధి లోని వెల్జాల్-3వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమ వా రం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తిరుమల మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీలకు పంపినట్‌లైతే క్రమశిక్షణ అలవాటు పడుతుందన్నా రు. సహాయం, సేవ చేసె గుణం అలవాటు పడి భవిష్యత్తులో మంచి పౌరులుగా రాణిస్తారని తెలిపారు. అనంతరం పిల్ల ల అభివృద్ధి ప్రణాళికలను గురించి చర్చించారు. తదు పరి పిల్లలకు అసైస్మెంట్ కార్డులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు నస్రీన్ బేగం, బూషణమ్మ, విజయ, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

చేవెళ్లలో రంజిత్‌రెడ్డి విజయం తథ్యం



పహాడీషరీఫ్: ప్రచారం నిర్వహిస్తున్న కొండల్‌యాదవ్



కందుకూరు: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

కందుకూరు: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం తథ్యమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఒక్కటే పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఆ దిశగా ఆలోచించి అందరూ కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పల్స శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, బాబురావు, మహేందర్, గణేష్‌నాయక్, శ్రీధర్‌ముదిరాజ్, ఈశ్వర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్, రాజు, బలరామ్, అరవింద్, నవీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాచుపల్లిలో..

బాచుపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు చెవులపల్లి కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క భూపాల్ రెడ్డి, కత్తుల వెంకటేష్, బుక్క పాండురంగారెడ్డి, సిద్ధేశ్వర్‌గౌడ్, కొంతం యుగేంధర్‌రెడ్డి, మద్దెల శ్రీశైలం, రాఘవేందర్, కత్తుల శ్రీశైలం, ఇ.శంకయ్యయాదవ్, బాలమల్లేష్‌యాదవ్, ఎండీ జహంగీర్, డి.ఈశ్వర్, పి.మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

కందుకూరు: మండలంలోని దెబ్బడగూడ తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, పీసీసీ నాయకుడు మల్లేశ్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, సత్యనారాయణ, సామ వెంకట్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, నీలం వెంకటేశ్, రవి, జయపాల్‌రెడ్డి, కుమార్, జంగారెడ్డి, కొండల్, విఘ్నేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బాల్‌రాజ్, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

పహాడీషరీఫ్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పండెం కొండల్ యాదవ్ అన్నారు. సోమవారం పహాడీషరీఫ్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్లలో ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారన్నారు. చారిత్రాత్మకమైన పహాడీషరీఫ్ దర్గాకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మెట్లపై మ్యాట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మీర్‌పేట: చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని మీర్‌పేట కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ పోరెడ్డి పద్మ సోమవారం జిల్లెలగూడ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నింటిన్నీ తప్పకుండా అమలు చేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సీ పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్‌నగర్‌లో సీఎం కార్నర్ మీటింగ్

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో జరిగే కార్నర్ మీటింగ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని, సీనియర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం పాల్గొనే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

షాద్‌నగర్: ఆత్మరక్షణ కోసం యువతీ, యువకులు యుద్ధ విద్యలు నేర్చుకోవాలని న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్ బాల్‌రాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆదర్శ కాలనీలో న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన సుమారు 20 మంది విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్టులతో పాటుగా ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ఎదుటి వారి నుంచి రక్షణ పొందేందుకు విధిగా యుద్ధ విద్యలు నేర్చుకోవాలన్నారు. కరాటేతో శరీరం దృఢంగా తయారవుతుందన్నారు. చిన్నారులు వేసవి సెలవులను వృథా చేయకుండా యుద్ధ విద్యలను అభ్యసించాలని సూచించారు.